క్లుప్తంగా

చెక్కుల పంపిణీ

గూడూరు: పేదల పెన్నిధి సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే శంకర్‌నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటకృష్ణారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీ బోడ కిషన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

గుడిసెల తొలగింపు

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ మున్సిపాలిటీ గాంధీపురం నాలుగో వార్డు శివారులో ఎమ్మార్పీఎస్, న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గుడిసెలను పోలీసు, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో జేసీబీలతో శనివారం తొలగించారు. ఈక్రమంలో గుడిసెవాసులు అడ్డుకోగా గుడిసె వాసులను కొంత మందిని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. అదేవిధంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో గుడిసెలు వేసేందుకు వెళ్లిన నాయకులు జెండాలు పాతగా పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు బోడ రమేష్, గుగులోత్ భీమానాయక్ మాట్లాడారు.

ట్రాక్టర్ బోల్తా..

కొత్తగూడ: ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని వేలుబెల్లి క్రాస్‌రోడ్డు సమీపంలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గంగారం మండలం బావురుగొండ గ్రామానికి చెందిన వజ్జ నాగమ్మ, దనుసరి సారక్క ట్రాక్టర్‌లో కంకులను కొత్తగూడకు తీసుకువవచ్చి విక్రయించుకున్నారు. తిరిగి వెళ్తున్న క్రమంలో వేలుబెల్లి క్రాస్ రోడ్డు మూలమలుపు వద్ద రోడ్డు ప్రక్కన విరిగి ఉన్న చెట్టు కొమ్మ ఎక్కడంతో ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు ప్రక్క చెట్లల్లో బోల్తా కొట్టింది. ఈఘటనలో నాగమ్మ కాలు విరుగగా, సారక్క నడుముకు తీవ్రగాయం అయ్యింది. క్షతగాత్రులను 108లో ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్రవాహనం చోరీ

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని డాక్టర్ బొడ్ల మధుసూదన్ ఆస్పత్రి సమీపంలో పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనం చోరీ జరిగిన సంఘటనపై ఆ వాహన యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నామని టౌన్ ఎస్సై టి.రామారావు శనివారం తెలిపారు. కురవి మండలం బంచరాయితండాకు చెందిన జర్పుల నరేష్ ఈ నెల 21వ తేదీన సదరు ఆస్పత్రి సమీపంలో తనద్విచక్ర వాహనాన్ని పార్క్ చేసి హైదరాబాద్‌కు వెళ్లాడు. 22వ తేదీన వచ్చి చూసే సరికి వాహనం కనిపించకుండా పోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని ఎన్‌జీఓస్ కాలనీకి చెందిన గృహిణి కాంపాటి సంధ్య అదృశ్యమైన సంఘటనలో ఆమె భర్త జీవన్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ ఎస్సై టి.రామారావు శనివారం తెలిపారు. శుక్రవారం సంధ్య ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతోఆమె ఆచూకీ కోసం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

29 మంది బైండోవర్

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని ఆర్తిగార్డెన్స్ సమీపంలో, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో గుడిసెలు వేసిన సంఘటనలో 29 మందిని అదుపులోకి తీసుకుని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని టౌన్ ఎస్సై వి.విజయ్‌రాంకుమార్ శనివారం తెలిపారు.

జామాయిల్ తోటకు నిప్పు



మరిపెడ రూరల్: జామాయిల్ తోటకు గుర్తు తెలియని వ్యక్తి నిప్పుపెట్టగా మంటలు చెలరేగాయి. ఈ సంఘటన అబ్బాయిపాలెం శివారులో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. అబ్బాయిపాలెం గ్రామానికి చెందిన రైతు సోదరులు అలువాల భద్రయ్య, అలు వాల చంద్రయ్య, అలువాల రామస్వామి వారి వ్యవసాయ క్షేత్రాల్లో జామాయిల్ తోట పెంపకాన్ని చేపట్టారు. శనివారం గుర్తు తెలియని వ్యక్తి తోటలోని ఎండిన ఆకులకు నిప్పు పెట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది.

రైలు కిందపడి వ్యక్తికి తీవ్రగాయాలు

డోర్నకల్: ప్రమాదవశాత్తు రైలు కింద పడ్డ వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన శనివారం డోర్నకల్ రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. డోర్నకల్‌కు చెందిన రిటైర్డ్ రైల్వే ఉద్యోగి మాలచ్చయ్య తన ఇంటికి వెళ్లేందుకు ఆర్‌ఆర్‌ఐ క్యాబిన్ వద్ద ట్రాక్ దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయనకు తీవ్రగాయలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి కాళ్లకు తీవ్రగాయలైనట్లు స్థానికులు పేర్కొన్నారు.

అక్రమంగా చెరువు మట్టి తరలింపు

- విక్రయించి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- ప్రమాదాలకు నెలవుగా మారుతున్న గుంతలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



అబ్బాయిపాలెం ఖరుదు కుంట నుంచి అక్రమంగా జేసీబీతో తరలిస్తున్న మట్టి



వెంకట్‌నాయక్ కుంటలో మట్టి తవ్వకంతో ఏర్పడిన గుంత

మరిపెడ రూరల్: మరిపెడ మండలం అబ్బాయిపాలెం శివారు ఖరీదు కుంట, వీరారం గ్రామపంచాయతీ పరిధిలోని వెంకట్‌నాయక్‌తండా శివారు వావిల కుంట నుంచి అక్రమార్కులు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే జేసీబీతో తవ్వకాలు జరిపి బహిరంగంగా మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. మట్టి అక్రమ తరలింపునకు స్థానిక నాయకులు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని రోజులుగా చెరువు, కుంటల మట్టిని వందలాది ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్న సంబంధిత ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెరువులో తవ్విన మట్టిని ప్రైవేట్ వ్యక్తుల పాట్ల చదును, నూతన గృహనిర్మాణాల కోసం తరలిస్తున్నట్లు సమాచారం. చెరువులను రక్షించాలని ప్రభుత్వం ఒక పక్క చెబుతున్నప్పటికి మరో పక్క అక్రమార్కులు మాత్రం అక్షయ పాత్రగా భావించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రమాదాలకు నెలవు..

ఇష్టం వచ్చినట్లు చెరువు, కుంటల్లో మట్టి తొలకం మూలంగా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. దాహం తీర్చుకోవడానికి చెరువు వద్దకు వచ్చిన మూగజీవాలు గుంతలో పడి మృత్యువాత పడే అవకాశం ఉంది. మనుషులకు కూడా గుంతలు ప్రమాదమేనని పలువురు వెల్లడిస్తున్నారు.

చెరువులను పరిరక్షించాలి..

గ్రామీణ ప్రాంతాల్లోని అన్నివర్గాల ప్రజలుకు చెరువు ఉపాధిని కల్పించే మార్గం. అలాంటి చెరువుల పరిరక్షణ లేకపోవడంతో భూములు కబ్జాకు గురవుతున్నాయి. చెరువు మట్టి తరలింపుతో చెరువు కింద భూములకు సాగునీరు అందకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా మట్టి అక్రమ తరలింపుపై సమాచారం ఇచ్చిన ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టించుకోలేదని స్థానికులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఉన్నతా ఇరిగేషన్ అధికారులు స్పందించి చెరువుల మట్టి అక్రమ తరలింపును నిలుపుదల చేసి చెరువులను పరిరక్షించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

ఇప్పటికే అక్రమంగా మట్టి తరలించే వారిని మొదటిసారి తప్పుకింద వదిలేశాం. మళ్లీ అదే తంతుగా మట్టి తరలిస్తే వాహనాలు సీజ్ చేయడంతోపాటు కేసులు నమోదు చేయిస్తాం. రైతులకు మాత్రమే పొలంలో పోసుకోవడానికి రేగడి మట్టికి అనుమతి ఇస్తాం తప్పా మరెవరికి చెరువు, కుంటల మట్టి తోలుకోవడానికి అవకాశం లేదు.

\- రాజశేఖర్, ఇరిగేషన్ డీఈ, మరిపెడ

కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాలి



గూడూరు: మాట్లాడుతున్న మల్లయ్య

గూడూరు: రాబోయో ఎన్నికల్లో తెలంగాణలో కేసీఆర్ పాలనకు చరమగీతం పాడి కాషాయం జెండా ఎగురవేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, వైస్ ఎంపీపీ ఎల్ది మల్లయ్య అన్నారు. మండల కేంద్రంలో శనివారం మేరుగు మల్లయ్యగౌడ్ అధ్యక్షతన మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడచిన 9 సంవత్సరాల పీఎం నరేంద్రమోదీ పాలనలో ప్రజలకు అందించిన ప్రధానమంత్రి జనసంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని ఈనెల 30వ తేదీ నుంచి జూన్ 30వరకు ప్రతీ గ్రామంలో నిర్వహించి గడగడపకు చేర్చాలని, ప్రజలకు వివరించాలన్నారు. అందుకోసం గ్రామస్థాయి కార్యకర్త నుంచి అందరూ పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మేరెడ్డి సురేందర్, రాంబాబు, సమ్మెట సుధాకర్, నాగరాజు, లక్ష్మణ్, అరవింద్, గుండెబోయిన మల్లేష్‌యాదవ్, యాకయ్య, సాయిబాబా, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

డోర్నకల్: రైతుల గోడు పట్టించుకోని సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ పిలుపునిచ్చారు. శనివారం డోర్నకల్‌లో జరిగిన పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యాసంగి వరిధాన్యం కాంటాలు అయి ధాన్యం బస్తాలు కల్లాల్లోనే ఉండటంతో, ఎప్పుడు వర్షాలు వస్తాయో అని రైతులు బిక్కు బిక్కు మంటూ రేయింబవళ్లు కాపలా కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రైతుల వరిధాన్యంను వెంటనే లారీల ద్వారా మిల్లులకు తరలించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు నగేష్, గణేష్‌నాయక్, ఎస్‌కె రెహమాన్, నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



బడిబాట వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

నెల్లికుదురు: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా సకల సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని తహసీల్దార్ యోగేశ్వరరావు, ఎంపీడీఓ శేషాద్రి, ఎంఈఓ గుగులోతు రాము అన్నారు. మండలంలోని పార్వతమ్మగూడెం ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం హెచ్ నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో శనివారం బడిబాట వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఓ నెలకుర్తి రవీందర్‌రెడ్డి, ఎంపీఓ పార్థసారథి, హెచ్‌ఎం జీవన్‌కుమార్, ఎంఐసీ కోర్డినెటర్ సుధాకర్, సీఆర్‌పీ వీరస్వామి, ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

మరిపెడ: ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో రైతులకు ఉచిత విద్యుత్, రైతు భీమా, రైతుబంధు, సాగునీరు, పండించిన వరిధాన్యం కొనుగోలు చేసే విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందిరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రామసహాయం సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ గుగులోతు అరుణరాంబాబు, జెడ్పీటీసీ శారదరవీందర్, మున్సిపల్ చైర్మన్ గుగులోతు సింధూరరవికుమార్, నాయకులు రామడుగు అచ్చుతరావు, తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని మున్సిపల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు.. మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డులో నీటి సమస్య రాకుండా చూడాలని సూచించారు. అదేవిధంగా మరిపెడ మున్సిపాలిటీకి చెందిన భాగ్యలక్ష్మి ఇటీవల వైద్యం వికటించి మృతిచెందడంతో బాధిత కుటుంబాన్ని కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

మహబూబాబాద్ రూరల్: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని ఇందిరానగర్ గ్రామ పంచాయితీ పరిధిలో గల సింగిలాల్‌తండ శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రం మండలం బోడమచ్యాతండా గ్రామపంచాయతీ పరిధిలో గల గుడితండాకు చెందిన బోడ కుమార్ అనే రైతు ఎద్దును మేత కోసం స్థానిక అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. 11 కేవీ విద్యుత్ వైరు తెగిపడి ఉండగా ఎద్దు కాళ్లకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఈ ప్రమాదంలో బాధిత రైతుకు రూ. 70వేల ఆస్తి నష్టం జరిగింది.

నమ్మించి మోసం చేయడమే కేసీఆర్ నైజం



సమావేశంలో మాట్లాడుతున్న రాధ

గూడూరు: సీఎం కేసీఆర్ ప్రజలను నమ్మిస్తూ మోసం చేయడమే లక్ష్యంగా పాలన కొనసాగిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నూనావత్ రాధ అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చినప్పటి నుంచి అధికారం చేపట్టిన సీఎం కేసీఆర్ ఒక్క హామీనైనా నెరవేర్చాడా అన్ని ప్రశ్నించారు. ప్రజలు సీఎం కేసీఆర్ మాయమాటలను నమ్మరాదని, రాబోయేది తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారమే అన్న ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం పంట నష్టపోయిన రైతులకు సీఎం హామీ ప్రకారం ఎకరాకు రూ. 20 వేల నష్టపరిహారం చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కత్తి స్వామి, శ్రీపాల్‌రెడ్డి, బుడిగె సతీష్‌గౌడ్, శ్రీనివాస్, సమ్మెట శ్రీనివాస్‌గౌడ్, బత్తుల రామన్న, ఉప సర్పంచ్ బాలు, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

నెల్లికుదురు: వీఓఏల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 29న చలో హైదరాబాద్‌కు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఇస్సంపల్లి సైదులు కోరారు. ఈమేరకు మండల కేంద్రంలోని వీఓఏల నిరవధిక సమ్మె శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు.

మహానాడుకు టీడీపీ నాయకులు

మహబూబాబాద్ రూరల్: ఏపీలోని రాజమహేంద్రవరంలో జరిగిన మహానాడుకు టీడీపీ నేతలు రైల్వేస్టేషన్ నుంచి శుక్రవారం రాత్రి బయలుదేరి వెళ్లారు. మహబూబాబాద్ పార్లమెంట్ నాయకులు ప్రేంచంద్ వ్యాస్, రంజిత్ కుమార్, పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ చాడా సురేఖ, జీఎల్.శ్రీధర్, జనార్దన్ రావు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

జీపీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్: గ్రామపంచాయతీ సిబ్బంది ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని మొట్లతండ సర్పంచ్ సుమన్, కార్యదర్శి శివప్రసాద్‌కు ప్రగతిశీల యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పైండ్ల యాకయ్య శనివారం వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నారాయణ, బిచ్చ, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్థూపం ఆవిష్కరణకు తరలిరావాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ అమరవీరుల స్థూపం మానుకోట జిల్లా కేంద్రంలోని ఈనెల 29న ఉదయం 10గంటలకు ప్రొఫెసర్ కోదండరాం చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు జిల్లా జేఏసీ, తెలంగాణ ఉద్యమకారులు డాక్టర్ డోలి సత్యనారాయణ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ, తెలంగాణ ఉద్యమకారులు ఎండీ. ఫరీద్, మార్నెని వెంకన్న, పిల్లి సుధాకర్, డోలి సత్యనారాయణ హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు గుగ్గిల పీరయ్య, మండల వెంకన్న, హన్మంతు, శ్రీనివాసులు, శ్రీశైలం, రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి సీఎం కృషి



మాట్లాడుతున్న సీతారాంనాయక్

తొర్రూరు: గిరిజనుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని మాజీ ఎంపీ సీతారాం నాయక్ తెలిపారు. శనివారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో గిరిజన నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలనలోనే రాష్ట్రంలోని గిరిజనులకు స్వర్ణయుగం వచ్చిందని, దేశంలో ఏ రాష్ట్రం చేయని రీతిలో ఎస్టీల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కేసీఆర్ అభ్యర్థన మేరకు గత ఎన్నికల్లో పోటీ చేయలేదని, ఈ ఎన్నికల్లో గులాబీ బాస్ టికెట్ ఇచ్చినా ఇవ్వకున్నా బరిలో ఉంటానన్నారు. సమావేశంలో నాయకులు గిరినాయక్, భిక్షపతి నాయక్, భీముడు నాయక్, లకావత్ యాదగిరినాయక్‌లు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి



అభినందిస్తున్న ఎంపీడీఓ కుమార్

తొర్రూరు: క్రీడలపై ప్రతి ఒక్కరూ ఆసక్తి పెంపొందించుకోవాలని ఎంపీడీఓ సింగారపు కుమార్ తెలిపారు. సీఎం కప్ క్రీడల్లో భాగంగా షటిల్, బాడ్మింటన్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన పట్టణ వాసి జలకం శివకుమార్‌ను శనివారం డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ గౌస్, శాట్ అధ్యక్షుడు తీగల కృష్ణారెడ్డి, కోచ్ బిక్షపతి, పీఈటీ శ్రీనివాసులు, సర్పంచ్ పోసాని పుష్పలీల, సిబ్బంది శ్రీకాంత్, మోహన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని నెహ్రూకు నివాళి



మహబూబాబాద్ రూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు



కురవిలో..

మహబూబాబాద్ రూరల్: మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి వేడుకలు జిల్లా కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుగులోతు వెంకట్‌నానాయక్ ఆధ్వర్యంలో నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, మాజీ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముల్లంగి ప్రతాపరెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రసాద్, కౌన్సిలర్ శ్రీను పాల్గొన్నారు.

కురవి: మండల కేంద్రంలోని గుడి సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నారాయణ రాజేందర్‌కుమార్, నాయకులు వీరన్న, లక్ష్మయ్య, గణేష్, వీరభద్రం పాల్గొన్నారు.

కేసముద్రం: మండల కేంద్రంలో నెహ్రూ వర్ధంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల ధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వర్‌రావు, ఎండి.అయూబ్‌ఖాన్, నాగరాజు, చందు, ఎంపీటీసీ బాలునాయక్ పాల్గొన్నారు.

గార్ల: నెహ్రూ వర్ధంతి వేడుకలను శనివారం గార్లలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్, ఎంపీటీసీ వెంకట్‌లాల్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దివ్యాంగులను ఆదుకోవాలి

కురవి: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులను ఆదుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాజా అన్నారు. శనివారం మండల కేంద్రంలో సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు రూ.10వేల పింఛన్ పెంపు కోసం ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సీతారామయ్య, ఎస్‌కె అఫ్జల్, బత్తిని వెంకన్న, ఇర్రి యాకయ్య, వెంకన్న పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

నెహ్రూసెంటర్: జిల్లా జనరల్ ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు అన్నారు. ఈమేరకు సంఘం ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆకుల రాజు మాట్లాడుతూ.. సిబ్బంది కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రవీందర్, శేఖర్, మనోజ్, వసంత, శ్రావణ్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

మరిపెడ రూరల్: మండలంలోని తానంచర్ల గ్రామంలో కంఠమహేశ్వరుని నూతన ఆలయ నిర్మాణం, స్వామివారి కల్యాణం వేడుకల కరపత్రాలను కరప్రతాలను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రామసహాయం సత్యనారాయణరెడ్డి గౌడ కులస్తుల పెద్దలతో కలిసి శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు వెంకన్న, నర్సయ్య, లింగయ్య, పెద్ద వెంకన్న పాల్గొన్నారు.

లారీలు రాక ఇబ్బందులు

గార్ల: రైతుల వరిధాన్యం కాంటాలు పెట్టి 20రోజులు గడిచినా లారీలు రాకపోవడంతో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు లారీల కోసం పడిగాపులు కాస్తూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంకు లారీలు రాక ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాల్లో 30,000 బస్తాల ధాన్యం కాంటాలు పెట్టి కొనుగోలు కేంద్రాల్లోనే ఉన్నాయని, అకాల వర్షాలు వస్తే వరిధాన్యం బస్తాలు తడిసిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికై నా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి గార్ల మండలానికి లారీలను త్వరితగతిన పంపించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



కురవి: మండలంలోని నేరడ శివారు ఎల్కచెట్టు తండా జీపీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ గుగులోత్ పద్మావతి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ దొడ్డ గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ అమిరిబాయి, రవినాయక్, భూక్య మల్సూర్, రమేష్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

బయ్యారం: అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ బయ్యారం మండల అధ్యక్షులుగా వంగ రవికుమార్‌ను ఎన్నుకున్నారు. శనివారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ప్రధాన కార్యదర్శి గుడిపెల్లి రమేష్‌రెడ్డి, కోశాధికారిగా మాలె వీరారెడ్డితోపాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సభ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి టి.వి.పుల్లంరాజు, ప్రచారసభ నాయకులు రవి, శ్రీనివాసాచారి, రామకృష్ణ, సందీప్, రాకేష్ పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టాలి

బయ్యారం: బయ్యారం పెద్దచెరువు నుంచి వృథాగా విడుదలవుతున్న నీటిని అరికట్టాలని పలుపార్టీల నాయకులు అధికారులను కోరారు. శనివారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో ప్రజాపంథా, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. చేపలు పట్టేందుకు వీలుగా చెరువులోని నీటిని విడుదల చేయటం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా నీటి విడుదలను నిలుపుదల చేయాలన్నారు. సమావేశంలో నాయకులు సూర్యం, కోటిరెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

ఎఫ్ఆర్వోపై చర్య తీసుకోవాలి

కొత్తగూడ: కొత్తగూడ ఎఫ్‌ఆర్‌ఓ పై చర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి ఆగబోయిన రవి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడారు. కొత్తగూడ సెక్షన్ ఆఫీసర్ చేసిన అక్రమాల్లో ఎఫ్‌ఆర్‌ఓ కూడా భాగస్వామి అయ్యాడని ఆరోపించారు. విచారణ చేపట్టిన అధికారులు ఎఫ్‌ఆర్‌ఓ పేరును ప్రస్తావించకపోవడం విచారకరం అన్నారు. విజిలెన్స్ విచారణ చేసి ఎఫ్‌ఆర్‌ఓ పై చర్య తీసుకోవాలని కోరారు.

సంతాపం

కేసముద్రం: మండలంలోని అర్పనపల్లి గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ వేం పురుషోత్తంరెడ్డి శనివారం గీసుకొండ మండలం గంగదేవిపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో సొంత గ్రామంలో, కేసముద్రం మండలంలో విషాదం చోటుచేసుకుంది. మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు సంతాపం తెలిపారు.

హక్కుపత్రాలు ఇవ్వాలి

కొత్తగూడ: అర్హులందరికి పోడు హక్కు పత్రాలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని అయిలయ్య డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

కొనసాగుతున్న వీఓఏల సమ్మె

గార్ల: వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, వేతనాలు పెంచాలని మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గార్లలో 41వ రోజు సమ్మె చేస్తున్న వీవోఏల సమ్మె శిబిరాన్ని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించి సమ్మెకు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్, శంషాద్‌బేగం, హరి, రాము పాల్గొన్నారు.

ప్రభుత్వం చొరవ చూపాలి

నెహ్రూసెంటర్: ఐకేపీ వీఓఏల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని వీఓఏలు కోరుతున్నారు. వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 41వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షురాలు కృష్ణవేణి, వీఓఏలు రోజా, అనిత, శోభా, తులసి, వీరన్న, కవిత, దివ్య, రమేష్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మహబూబాబాద్: 9010144453
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎస్.కె. అన్వర్, (S.R) : 7997958185
ఎం. మురళి, (S.R) (తొర్రూరు) : 7680822646